ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
మంగళవారం 5 నవంబరు 2024



కెంగేరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపాలయ్య





ఉపపోరు.. ప్రచార జోరు



శిగ్గావి బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య

పండుగ ముగిసింది...
ప్రచారం జోరందుకుంది
మనవడి కోసం...
చన్నపట్టణకు దేవెగౌడ
రెండు రోజులు
శిగ్గావిలోనే సీఎం
సందూరుకు విజయేంద్ర

బెంగళూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మూడు శాసనసభ స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికలను అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ నేతలు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నాయి. నామినేషన్లు, ఉపసంహరణలు ముగిశాయి. పోలింగ్‌కు మరో 9రోజులు మాత్రమే గడువు ఉంది. ఇటీవల నాలుగైదురోజులుగా దీపావళి పండుగ ఉండడంతో కీలకనేతలు ప్రచారంలో పాల్గొనలేదు. అయితే పండుగ ముగియడంతో సోమవారం నుంచి ప్రచారం జోరందుకుంది. సీఎం సిద్దరామయ్య హావేరి జిల్లా శిగ్గావి ప్రచారంలో పాల్గొన్నారు. కులగూరు బహిరంగసభలో ఆయన పాల్గొన్నారు. రెండురోజులపాటు అక్కడే మకాం వేయనున్నారు. ఒక శాసనసభ నియోజకవర్గం కోసం సీఎం సిద్దరామయ్య రెండు రోజులు గడపడం సర్వత్రా చర్చనీయాంశమయ్యింది. ఇప్పటికే ఆయన ప్రతి నియోజకవర్గానికి పదిమంది మంత్రులను కేటాయించింది. అదే తరహాలోనే 30-40మంది ఎమ్మెల్యేలను కేటాయించారు. అయినా స్వయంగా రంగంలోకి దిగారు. గ్రామాల వారీగా ఆయన ప్రచారంలో పాల్గొననున్నారు. మరోవైపు డీసీఎం డీకే శివకుమార్ చన్నపట్టణకు వెళ్లారు. కోడంబళ్ళి, వైటీ హళ్ళిలతోపాటు సోమవారం బహిరంగసభల్లో పాల్గొన్నారు. సీపీ యోగేశ్వర్ స్థానికంగా అందుబాటులో ఉంటారని, నియోజకవర్గ అభివృద్ధికోసం కట్టుబడిన వ్యక్తి అని ఆయనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఇదే నియోజకవర్గం నుంచి గెలుపొందానని చెప్పుకొనే కేంద్రమంత్రి కుమారస్వామి ఏం చేశారని ప్రశ్నించారు. నియోజకవర్గానికి ఆయన చేసిన ప్రత్యేకలతు ఏమిటో చెప్పాలని, లేదంటే వెనుదిరగాలని ప్రచారంలో ప్రశ్నిస్తున్నారు. ఇక బీజేపీ-జేడీఎస్‌ల ఉమ్మడి అభ్యర్థి నిఖిల్ కుమారస్వామి తరఫున ప్రచారానికి తాత, మాజీ ప్రధాని దేవెగౌడ రంగంలోకి దిగారు. ఆయన వయోభారంతోపాటు ఇటీవల కొంతకాలంగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. పార్లమెంటు సమావేశాలు మినహా దేవేగౌడ మరే కార్యక్రమంలోనూ పాల్గొనలేదు. అయితే మనవడు నిఖిల్‌ను గెలిపించాలనే లక్ష్యంతో స్వయంగా రంగంలోకి దిగారు. మండ్య లోక్‌సభ, రామనగర శాసనసభ ఎన్నికల్లో నిఖిల్ ఓటమి చెందిన విషయం తెలిసిందే. మూడోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రంగంలోకి దిగారు. మరోవైపు కేంద్రమంత్రి, నిఖిల్ తండ్రి కుమారస్వామి అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకుని పూర్తిగా చన్నపట్టణకే పరిమితమయ్యారు. ప్రతిరోజూ గ్రామాల వారీగా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు అభ్యర్థి నిఖిల్ భార్య రేవతి చన్నపట్టణలో సోమవారం ప్రచారంలో పాల్గొన్నారు. దేవెగౌడ కుటుంబీకులంతా చన్నపట్టణలో మకాం వేశారు. బళ్లారి జిల్లా సందూరులో బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంతు తరఫున పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర ప్రచారం చేశారు. మూడు నియోజకవర్గాల పరిధిలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది.

రూ.27.50లక్షలు స్వాధీనం

బళ్లారి సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికల్లో నగదు తరలింపుపై పోలీసులు నిఘా పెంచారు. సందూరు అసెంబ్లీ ఉప ఎన్నిక నేపథ్యంలో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. సందూరు పరిధిలోని డి.బాసాపురం గ్రామ చెక్‌పోస్టు వద్ద సరైన పత్రాలు లేని రూ.27.50 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సందూర్ అసెంబ్లీ ఉప ఎన్నికల ఎన్నికల అధికారి రాజేష్ తెలిపారు. ఎస్‌ఎస్‌టీ టీం లీడర్ లింగప్ప బృందం స్వాధీనం చేసుకుని ఆదాయపు పన్ను అధికారులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.



స్వాధీనం చేసుకున్న కారు, నగదు



కోలారులో మాట్లాడుతున్న ప్రతిపక్షనేత అశోక్

అన్నదాతకు నోటీసులు అన్యాయం

- ఉప ఎన్నికల కోసమే వక్ఫ్ భూముల వివాదం
- ప్రతిపక్షనేత అశోక్ మండిపాటు
- రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ నిరసనలు

బెంగళూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికల్లో ఓ వర్గం ఓట్లకోసమే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్యాయంగా నోటీసులు జారీ చేస్తోందని ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తుల పేరిట తరతరాలుగా రైతులు సాగు చేస్తున్న భూములకు నోటీసులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు నోటీసులు జారీ చేయడంపై నగరంలో సోమవారం బీజేపీ నాయకులు నిరసన చేపట్టారు. బెంగళూరులో కెంగేరి, కేఆర్‌పురంతోపాటు పలు చోట్ల నిరసనలు సాగాయి. ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ బీదర్ కోటను వక్ఫ్ ఆస్తిగా 2005లోనే గుర్తించారన్నారు. రాష్ట్రంలో అన్నదాతలను ప్రభుత్వం ఇబ్బంది కలిగిస్తోందన్నారు. రాష్ట్రమంతటా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా మారుతోందన్నారు. ధారవాడ, కలబురగి, హుబ్బళ్ళితోపాటు వివిధ జిల్లాల రైతులకు నోటీసులు ఇచ్చారన్నారు. ఓవైపు సీఎం సిద్దరామయ్య నోటీసులు రద్దు చేస్తామని చెబుతున్నా అలాంటి ప్రక్రియ చేపట్టిన దాఖలాలు లేవన్నారు. దీని వెనుక ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. హుబ్బళ్ళి, హావేరిలలో జరిగిన కార్యక్రమంలో పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

మంత్రి జమీర్‌ను కేబినెట్ నుంచి తొలగించాలి..

దొడ్డబళ్ళాపుర : వక్ఫ్‌బోర్డు నుంచి రైతుల భూములను రక్షించే విషయంలో విఫలమైన మంత్రి జమీర్ అహ్మద్‌ను కేబినెట్ నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ బెంగళూరు గ్రామీణ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. తహసీల్దార్ విభా విద్యా రాథోడ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో తుగ్లక్ పాలన సాగిస్తోందంటూ ఆక్రోశం వ్యక్తం చేశారు. ఒక వర్గం కోసం రాష్ట్ర రైతులను నాశనం చేసేలా మంత్రి జమీర్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అమాయక రైతుల పహణి పత్రాలలో వక్ఫ్ ఆస్తిగా నమోదు చేసి నోటీసులు ఇచ్చారని, రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనలో బెంగళూరు గ్రామీణ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రామకృష్ణప్ప, కార్యదర్శి ఆర్ గోపి, నగరసభ సభ్యుడు బంతి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



దొడ్డబళ్ళాపురలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

డీసీఎం డీకేకు ఊరట

- సుప్రీంలో సీబీఐ పిటిషన్
- విచారణ నాలుగు వారాలు వాయిదా

బెంగళూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో డీసీఎం డీకే శివకుమారకు తాత్కాలిక ఊరట లభించింది. అక్రమాస్తుల కేసు విచారణలు కొనసాగించేందుకు సీబీఐ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను నాలుగు వారాలపాటు వాయిదా వేసింది. న్యాయమూర్తులు సూర్యకాంత్, ఉజ్జల్ భుయస్‌ల ధర్మాసనం సోమవారం సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణ జరిపింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కర్ణాటక హైకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా పిటిషన్‌ను ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఈమేరకు నాలుగువారాలపాటు వాయిదా వేశారు. దీంతో డీసీఎం డీకే శివకుమార్‌కు నాలుగువారాలపాటు ఉపశమనం లభించినట్లయ్యింది. 2013-18వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నవేళ డీకే శివకుమార్ ఆస్తులు 74.93 కోట్ల రూపాయలు ఎక్కువ కావడంపై బీజేపీ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించింది. అయితే 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం, సీబీఐకు ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తూ వివాదాన్ని లోకాయుక్తకు అప్పగించింది. సీబీఐ దర్యాప్తు దాదాపు ముగింపు దశలో ఉందని ఇటువంటి సందర్భంలో కేసును రద్దు చేయడం సరికాదని సీబీఐతోపాటు బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌లు వేర్వేరు అయినా అంశం ఒక్కటే కావడంతో విచారణ జరిపిన హైకోర్టు పిటిషన్ ను రద్దు చేసి సుప్రీంకోర్టులో తేల్చుకోవాలంటూ సూచించింది. అందుకు అనుగుణంగానే సీబీఐ తరఫు న్యాయవాదులు, యత్నాళ్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. సెప్టెంబరు 17న సుప్రీం కోర్టు, రాష్ట్ర ప్రభుత్వంతోపాటు డీకే శివకుమార్‌కు నోటీసులు జారీ చేసింది. ఇదే అంశాన్ని సొలిసిటర్ జనరల్ సోమవారం కోర్టు ముందు ప్రస్తావించగా నాలుగువారాలపాటు వాయిదా వేశారు. ఓ వైపు సీఎం సిద్దరామయ్యకు లోకాయుక్త నోటీసులు ఇచ్చిన వేళ, కనీసం డీసీఎంకైనా ఊరట లభించిందని పార్టీలో అభిప్రాయపడుతున్నారు.





కాశీవిశ్వనాథుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా కుంభాభిషేకం

మహదేవపుర సమీపంలోని బిదరహళ్ళి కాశీవిశ్వనాథస్వామి ఆలయ కుంభాభిషేకం సోమవారం వైభవంగా నిర్వహించారు. 7

బాల్య వివాహాలను నియంత్రిస్తే..

బహుమానం..!

- జీరోస్థాయికి చేరితే గ్రామపంచాయతీకి అర లక్ష
- దురాచారాన్ని అడ్డుకోవడానికి ప్రభుత్వ నిర్ణయం
- స్వచ్ఛంద సంస్థలు చైతన్యం కల్పించాలి
- స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి లక్ష్మి హెబ్బాళ్కర్



బెంగళూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, కేసులు నమోదు చేస్తున్నా బాల్య వివాహాలు రాష్ట్రంలో జరుగుతూనే ఉన్నాయి. అయితే బాల్యవివాహాలను సంపూర్ణంగా నియంత్రించాలని భావిస్తున్న ప్రభుత్వం గ్రామాలవారీగా ప్రజలను, పంచాయతీస్థాయిలో ప్రజాప్రతినిధుల్లో చైతన్యం తీసుకు రావాలని నిర్ణయించింది. బాల్యంలోనే వివాహాలు జరిగితే వారి ఆరోగ్యం, భవిష్యత్తు జీవితంపై పెను ప్రభావం చూపుతుందని దశాబ్దాల కాలంగా బాలలహక్కులపై పోరాటాలు చేస్తున్నవారు సూచిస్తున్నారు. బాల్య వివాహాలు కుటుంబాలలో ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయనేది తెలిసిందే. అయితే రాష్ట్రంలో బాల్యవివాహాలు ఇంకా పూర్తిగా నిర్మూలనకు నోచుకోలేదు. ఇప్పటికీ మారుమూల ప్రాంతాల్లో, విద్యాభ్యాసం లేనివారు, ఆర్థికంగా వెనుకబడినవారి కుటుంబాల్లో దురాచారాన్ని కొనసాగిస్తున్నారు. బాల్యవివాహాలను నిర్మూలించాలంటే గ్రామస్థాయిలో ప్రోత్సాహకం ఉండాలని స్త్రీ శిశుసంక్షేమశాఖ భావిస్తోంది. అందుకే ఏఏ గ్రామ పంచాయతీల్లో పూర్తిగా బాల్యవివాహాలను కట్టడి చేస్తారో అటువంటి పంచాయతీకి అరలక్ష నగదు బహుమానం ఇవ్వనున్నట్లు తెలిపింది. ప్రధానంగా సామూహిక వివాహాలు, ఆలయాలలో జరిగే పెళ్లిళ్లపై పర్యవేక్షించేందుకే ప్రత్యేకంగా అధికారులకు సూచనలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా గ్రామస్థాయిలో ఉండే ఆలయాల వద్ద పెళ్లిళ్లపై ప్రజాప్రతినిధులు సమాచారం సేకరించాలని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ సూచిస్తోంది. అందుకే బాల్య వివాహాల నియంత్రణకు పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయడం కూడా ఇందులో భాగమేననే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఏడుశాఖల సమన్వయం

బాల్యవివాహాలను నియంత్రించేందుకు స్త్రీశిశుసంక్షేమశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖలతోపాటు ఏడుశాఖలు సంయుక్తంగా పర్యవేక్షిస్తాయి. ఏశాఖకు చెందిన అధికారులకు సమాచారం అందినా పోలీసుల సహకారంతో అన్నిశాఖల అధికారులు సమన్వయంగా కార్యాచరణ చేపడతారు. రాష్ట్రంలో బాల్యవివాహాల నియంత్రణకు వివిధశాఖలకు చెందిన 59వేలమంది అధికారులను పర్యవేక్షకులుగా నియమించారు.

తగ్గిన బాల్యవివాహాలు

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు 1,093 బాల్యవివాహాలపై ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 917 వివాహాలు జరగకుండా కట్టడి చేశారు. అయితే 176 బాల్య వివాహాల గురించి సమాచారం తెలిసేసరికే వేడుకలు జరిగాయి. వీటిలో 160 వివాహాలకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రెండో త్రైమాసికంలో జూన్ నుంచి సెప్టెంబరు దాకా 531 ఫిర్యాదులు అందగా 363 పెళ్లిళ్లను నియంత్రించారు. కానీ 168 పెళ్లిళ్ల జరిగాయి. వీటిలో 135మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రాష్ట్రంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబరుదాకా 1,624 ఫిర్యాదులు అందగా 1280 వివాహాలను అడ్డుకోగలిగారు. 344 పెళ్లిళ్ల జరిగాయి, వీటిలో 295 పెళ్లిళ్లపై ఫిర్యాదులు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

ప్రత్యేక పర్యవేక్షణ

బీదర్‌లో 29 ఫిర్యాదులు అందగా సకాలంలో వాటిని నియంత్రించగలిగారు. బెంగళూరులోని నాలుగు డివిజన్‌ల పరిధిలో శివారు ప్రాంతాల్లో బాల్య వివాహాలపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ప్రధానంగా కొడగు, రాయచూరు, గదగ్, బెంగళూరు దక్షిణ, బాగల్కోట, ఉత్తరకన్నడ జిల్లాల్లో గడిచిన ఆరు నెలల్లో ఒక్కోబాల్య వివాహం జరగ్గా, ఉడుపి, తుమకూరు, దక్షిణకన్నడ, విజయపుర జిల్లాల్లో ఆరు నెలల వ్యవధిలో చెరో రెండు బాల్యవివాహాలు జరిగాయి.

సంపూర్ణంగా అరికడతాం : మంత్రి లక్ష్మి హెబ్బాళ్కర్



రాష్ట్రంలో బాల్యవివాహాలు సంపూర్ణంగా నియంత్రించాలనేది ప్రభుత్వ ఉద్దేశమని స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి లక్ష్మి హెబ్బాళ్కర్ అభిప్రాయపడ్డారు. గ్రామస్థాయి నుంచి బాల్య వివాహాలను నియంత్రించాలనేది తమ ఆశయమన్నారు. అందుకే ప్రతి గ్రామంలోనూ ప్రజాప్రతినిధులు అధికారులు విద్యావంతులు చైతన్యవంతులుగా ఉండాలన్నారు. బాల్యవివాహాలు పూర్తిగా నియంత్రించగలిగిన గ్రామపంచాయతీలకు 50వేల రూపాయల ప్రోత్సాహకం అందించదలిచామన్నారు. ఈ ఏడాది నుంచే ప్రోత్సాహకాలను అందజేస్తామన్నారు.

తిరిగొచ్చిన కష్టాలు..!

- పండుగ తర్వాత ఐటీ నగరికి వెనుదిరిగిన ప్రజలు
- నగరం నలువైపులా ట్రాఫిక్ జామ్
- మెజిస్టిక్, మెట్రో స్టేషన్ సమీపంలో కిలోమీటరు మేర..



తుమకూరు రోడ్డుపై భారీ ఎత్తున నిలిచిపోయిన వాహనాలు

బెంగళూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు వరుస సెలవులు, ఆపై వారాంతం కలసి రావడంతో సొంతూళ్లకు వెళ్లిన వారంతా సోమవారం వెనుదిరిగారు. అయితే తిరుగు ప్రయాణంలో నగరవాసులకు చుక్కలు కనబడ్డాయి. గంటల కొద్దీ ట్రాఫిక్‌లోనే గడపాల్సి వచ్చింది. ఆదివారం అర్ధరాత్రి నుంచే నగరానికి వచ్చే వాహనాలసంఖ్య పెరిగింది. సోమవారం ఉదయం మైసూరు రోడ్డు, తుమకూరు రోడ్డు, ఆంధ్రప్రదేశ్ అనంతపురం వైపునుంచి వచ్చే జాతీయ రహదారి, చిత్తూరు-తిరుపతి నుంచి వచ్చే పాత మద్రాస్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. కార్లు, బస్సులు రోడ్డుపైనే నిలిచిపోయాయి. గంటలతరబడి ముందుకు కదిలే పరిస్థితి లేకుండా పోయింది. కేఆర్‌పురం మెయిన్‌రోడ్డులో ద్విచక్రవాహనం ముందుకు కదిలేందుకు సాధ్యం కాని పరిస్థితి ఏర్పడింది. గురగుంటపాళ్య వద్ద వాహనాలు సుమారు అరగంటకుపైగా నిలిచిపోయాయి. నెలమంగల ట్రాఫిక్ పోలీసులు రోడ్లపైనే గడిపారు. వాహనాలు ముందుకు వెళ్లేందుకు తంటాలు పడ్డారు. మెజిస్టిక్ మెట్రో స్టేషన్‌లో అరకిలోమీటరు మేర క్యూ ఉండడంతో అధికారులు, పాలకుల తీరుపై ప్రజలు మండిపడ్డారు. వైట్‌ఫీల్డ్‌వైపు నుంచి, తుమకూరు రోడ్డు, మైసూరు, కనకపుర రోడ్లనుంచి మెట్రో ద్వారా నగరంలోకి సునాయాసంగా చేరుకోవచ్చునని భావించినవారికి షాక్ తగిలింది. స్టేషన్‌లోనూ వేచియుండే పరిస్థితినెలకొంది. ఇక మెట్రోలో నిలబడే ప్రయాణించాల్సి వచ్చింది. రైళ్ల, బస్సుల్లో మెజిస్టిక్ చేరుకున్నవారు గమ్య స్థానాలకు చేరుకునేందుకు నానా తంటాలు పడ్డారు.



జాలహళ్ళి క్రాస్‌లో బస్సుల కోసం వేచియున్న ప్రయాణికులు

రాక్రీట్‌కు ఉపాధి..!

- జగనన్న ఇళ్ల నిర్మాణంలో రాక్రీట్ దోపిడీ
- 90 రోజుల ఉపాధి పథకం నిధులు స్వాహా
- నిర్మాణాలు చేయకనే సొమ్ము బదలాయింపు
- జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి
- గుట్టుగా వ్యవహారం చక్కబెట్టిన కొందరు అధికారులు

అనంతపురం సిటీ, నవంబరు4(ఆంధ్రజ్యోతి): జగనన్న ఇళ్ల నిర్మాణంలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి చెందిన రాక్రీట్ సంస్థ రూ.కోట్లను మింగేసింది. ప్రతి ఇంటికి ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల పనిదినాలకు అందించే రూ. 30 వేలను కూడా డ్వామా ఏపీఓలు, హౌసింగ్ అధికారుల సహకారంతో గుట్టుగా కాజేసిందనే ఆరోపణలు ఉన్నాయి. కొన్నిచోట్ల ఇళ్ల నిర్మాణం జరగకుండానే కొందరు అధికారులు రాక్రీట్ సంస్థకు బిల్లులు బదలాయించారనే ఆరోపణలు ఉన్నాయి. రాక్రీట్ సంస్థ దోపిడీలో తోపు సమీప బంధువైన ఓ ఏపీఓ కీలకంగా వ్యవహరించారని సమాచారం. జిల్లాలోని ఇతర ప్రాంతాలలో కూడా డ్వామా, హౌసింగ్ శాఖలకు చెందిన కొందరు అధికారులు ఆయా లబ్ధిదారులతో కలిసి అక్రమాలకు పాల్పడినట్లు ఆశాఖ వర్గాల ద్వారా తెలిసింది.

● తోపు సమీప బంధువు ద్వారా అక్రమ వ్యవహారం

గతంలో వైసీపీ అధికారంలోకి రాగానే తోపు తమ సమీప బంధువైన ఓ ఏపీఓను తన నియోజకవర్గ పరిధిలోని మండలానికి తెచ్చుకున్నాడు. ఆ ఏపీఓ ద్వారా గుట్టుగా వ్యవహారం నడిపించి జగనన్న ఇళ్లకు సంబంధించి 90 రోజుల ఉపాధి పని దినాల నగదును రాక్రీట్ సంస్థకు తరలించేలా ప్రణాళిక రచించి అమలు జరిపారు. విషయం తెలిసినా ఆశాఖ పీడీ కూడా ఏమీ చేయలేని స్థితిలోకి ఆ ఏపీఓ, తోపు నెట్టేశారనే చర్చ అప్పట్లో సాగింది. నిధులను లబ్ధిదారుడి అకౌంట్‌కు బదలాయించడం, వెంటనే రాక్రీట్ సంస్థకు అందించేలా అధికారుల ద్వారా కథ నడిపించారని అప్పట్లో జోరుగా వినిపించింది. ఇన్ని అక్రమ వ్యవహారాలు నడిపారనే ఆరోపణలున్న ఆ ఏపీఓ ఇప్పటికి అక్కడే పనిచేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. వైసీపీ హయాంలో రాక్రీట్‌కు అక్రమంగా నిధుల బదలాయింపులో ఆ ఏపీఓ కీలకంగా వ్యవహరించినా కూటమి ప్రభుత్వం ఇప్పటికి కొనసాగిస్తుండటం పట్ల ఆశాఖ ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● జిల్లాలో జగనన్న ఇళ్ల పరిస్థితి ఇలా...

- రాక్రీట్ సంస్థ చేపట్టిన ఇళ్ల సంఖ్య: 7671
- గత ఐదేళ్లలో పూర్తి చేసిన ఇళ్ల సంఖ్య: 350
- వివిధ దశలలో ఆగిపోయిన ఇళ్ల సంఖ్య: 7321
- రాష్ట్ర వ్యాప్తంగా రాక్రీట్ సంస్థ చేపట్టిన ఇళ్ల సంఖ్య: 50,385
- గత ఐదేళ్లలో పూర్తి చేసిన ఇళ్ల సంఖ్య: 1500 మాత్రమే
  (ఈ పనులకే రూ. 350 కోట్లు బిల్లులు రాక్రీట్‌కు తరలించారని సమాచారం.)
- జిల్లా వ్యాప్తంగా మంజూరైన ఇళ్ల సంఖ్య: 72,457
- పూర్తయిన ఇళ్ల సంఖ్య: 28,021
- ఇప్పటికీ నిర్మాణానికి నోచుకుని ఇళ్ల సంఖ్య: 8161
- సుమారు 70 శాతం ఇళ్లకు 90 రోజుల కింద బిల్లులు చేసి రూ. కోట్లలో బిల్లులను స్వాహా చేశారనే సమాచారం.

● జిల్లా వ్యాప్తంగా ఇదే దుస్థితి

రాక్రీట్ సంస్థ చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లోనే కాకుండా జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా ఇదే తరహా అవినీతి, అక్రమాలు జరిగినట్లు సమాచారం. 90 రోజుల ఉపాధి సొమ్మును ఓ రకంగా రాక్రీట్ సంస్థ స్వాహా చేస్తే మిగతా ప్రాంతాల్లో డ్వామాలోని కొందరు ఏపీఓలు, హౌసింగ్‌లోని కొందరు అధికారులు కలిసి దోపిడీ చేశారు. లబ్ధిదారుడితో కుమ్మక్కై కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలను ఏమాత్రం పరిశీలించకుండానే 90 రోజుల పనిదినాల అమౌంట్‌ను డ్రా చేసి వాటాలుగా పంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల కనీసం పునాదులు తీయకుండానే 90 రోజుల పని దినాల అమౌంట్‌ను డ్రా చేసి అవినీతి, అక్రమాలకు పాల్పడటం విమర్శలకు తావిస్తోంది. రాప్తాడు, శింగనమల, కళ్యాణదుర్గం, ఉరవకొండ, తాడిపత్రి, రాయదుర్గం, గుంతకల్లు నియోజకవర్గాల్లో ఎక్కువగా అవినీతి అక్రమాలు జరిగినట్లు సమాచారం.



జిల్లా గృహ నిర్మాణశాఖ కార్యాలయం

● ఏపీఓలదే కీలకపాత్ర

ఉపాధి పథకం కింద 90 రోజుల పనిదినాల నిధుల బదలాయింపు జరిగే ప్రక్రియలో ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న ఏపీఓల పాత్ర ఎక్కువగా ఉంటుంది. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో కొందరు ఏపీఓలకు సొంత ప్రాంతాల్లో పోస్టింగ్ ఇవ్వడం, ప్రజా ప్రతినిధుల బంధువులకు అనుకూలమైన ప్రాంతాల్లో పోస్టింగ్ వేయడం, కొందరు టెక్నికల్ అసిస్టెంట్‌లకు ఏపీఓలగా పోస్టింగ్ ఇవ్వడంతో ఎక్కడికక్కడ అవినీతి అక్రమాలు పెరిగిపోయాయి. హౌసింగ్ ఉద్యోగుల్లోను కొందరు వారితో కలిసి అక్రమాలకు పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయి.

మా దృష్టికి రాలేదు



ఉపాధి పథకంలో 90 రోజుల పనిదినాల కింద అవినీతి జరిగిందనే విషయం మా దృష్టికి రాలేదు. ఏపీఓల ద్వారా బిల్లులు మంజూరు చేస్తాం. మా పరంగా తప్పు జరిగి ఉంటే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. సమగ్ర నివేదిక కూడా ఆయా ప్రాంతాల ఏపీఓల వద్ద ఉంటుంది.

- శైలజ, పీడీ, జిల్లా గృహ నిర్మాణశాఖ

నేరం చేయాలంటే భయపడాలి

- మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకోండి
- కరడుగట్టిన నేరగాళ్ల కదలికలపై దృష్టి పెట్టండి
- ఉమ్మడి జిల్లా పోలీసులతో హోంశాఖ మంత్రి అనిత



మాట్లాడుతున్న హోం శాఖ మంత్రి అనిత

అనంతపురం క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 'మహిళలు, చిన్నారులతో అసభ్యంగా ప్రవర్తించే వారి పట్ల కఠినంగా వ్యవహరించండి. వారు నేరం చేయాలంటే భయపడేలా పోలీసులు విధులు ఉండాలి' అని హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. అనంతపురం నగరంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి జిల్లా పోలీసు అధికారులతో సోమవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది జరిగిన నేరాలు, రోడ్డు ప్రమాదాలు, పోలీసుల చర్యలు, సేవల గురించి ఎస్పీలు జగదీష్, రత్న పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. గత నెలలో చిలమత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన గ్యాంగ్ రేప్ ఘటనపై పోలీసులు తీసుకున్న చర్యల గురించి హోం మంత్రి లోతుగా సమీక్షించారు. సమాజంలో యూనిఫామ్ ధరించే ఉద్యోగాలు చాలా ఉన్నా పోలీసు ఉద్యోగానికి ప్రత్యేక గౌరవం ఉందని అన్నారు. ఇందుకు అందరూ గర్వపడాలని అన్నారు. బాధ్యత కలిగిన శాఖలో ఉన్నామని, పోలీసులు ఉన్నారన్న నమ్మకంతో ప్రజలు స్వేచ్ఛగా దైనందిన కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని అన్నారు. నక్సలిజాన్ని పూర్తిగా అణచిన చరిత్ర రాష్ట్ర పోలీస్ శాఖకు ఉందని అన్నారు. ఇలాంటి పోలీసులకు చిన్న చిన్న ఘటనలతో మచ్చ రాకూడదని అన్నారు. ముందస్తు చర్యలతో నేరాలను నియంత్రించాలని సూచించారు. కరడుగట్టిన నేరస్థులు, రౌడీషీటర్లు, చెడునడత కలిగిన వారి కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. విధుల్లో నిర్లిప్తత వద్దని అన్నారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో కీలక పాత్ర వహించే సీసీ కెమెరాలను అవసరమైనన్ని అందజేస్తామని, టెక్నాలజీని వాడుకోవాలని సూచించారు. మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. గంజాయి నియంత్రణ పక్కాగా జరగాలని అన్నారు. మెరుగైన సేవలు అందించిన వారికి గుర్తింపు ఉంటుందని అన్నారు.



సమీక్షకు హాజరైన ఉమ్మడి జిల్లా పోలీసు అధికారులు

అలాంటి ఘటనలు జరగకూడదు..

చిలమత్తూరు గ్యాంగ్ రేప్ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని లా అండ్ ఆర్డర్ ఐజీపీ శ్రీకాంత్ సూచించారు. పదే పదే నేరాలకు పాల్పడేవారిపై గట్టి నిఘా కొనసాగించాలని సూచించారు. తీవ్రమైన నేరాల్లో ముద్దాయిలకు కఠిన శిక్షలు పడేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. విజిబుల్ పోలీసింగ్, బేసిక్ పోలీసింగ్‌ను మెరుగుపరచుకోవాలని సూచించారు. గంజాయి రవాణా, విక్రయం, వినియోగించేవారి వరకు ఎవరినీ వదలకుండా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, హోంశాఖ మంత్రి ఓఎస్డీ అనిల్ పులిపాటి, ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

అతిగా మద్యం సేవించి కర్ణాటక వాసి మృతి

చిలమత్తూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం సేవించి కర్ణాటక వాసి మృతి చెందాడు. ఎస్ఐ మున్నీర్ అహమ్మద్ తెలిపిన మేరకు.. కర్ణాటక రాష్ట్రం గుడిబండకు చెందిన రమేష్ (45) తన స్నేహితులతో కలిసి వీరాపురం పరిసర ప్రాంతానికి ఆదివారం సాయంత్రం వచ్చి అతిగా మద్యం సేవించాడు. లిక్కర్‌తో పాటు కల్లు కూడా అతిగా సేవించడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్నేహితులు అతడిని ఇంటికి తీసుకుపోవడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. రాత్రి ప్రాణాలు వదిలాడు. సోమవారం ఉదయం గమనించిన స్థానికులు సమాచారం అందించారు. అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

తల్లిని వద్దన్న బిడ్డలపై కేసు

● సీనియర్ సిటిజన్స్ యాక్ట్ కింద నమోదు ● సుమోటోగా స్వీకరించిన పోలీసులు

పత్తికొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నడిరోడ్డుపై తల్లిని కర్కశంగా వదిలేసిన బిడ్డలపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజులుగా తల్లిని తీసుకెళ్లాలంటూ పోలీసులు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. రెండు పర్యాయాలు కుమారుడు, కుమార్తెలకు కౌన్సెలింగ్ ఇచ్చినప్పటికీ వారిలో మార్పు రాలేదు. దీంతో గుంతకల్లులో ఉంటున్న కుమారుడు శ్రీనివాసులు, పత్తికొండ, బళ్లారిలో ఉంటున్న కుమార్తెలు శ్రీదేవి, సరస్వతిలపై సీనియర్ సిటిజన్స్ ప్రొటెక్షన్ యాక్ట్, సెక్షన్ 24 ప్రకారం సుమోటోగా కేసు నమోదు చేసినట్లు పత్తికొండ సీఐ జయన్న వెల్లడించారు. పత్తికొండ పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయం వెనుక కాలనీలో వృద్ధురాలు తిరుపతమ్మను కన్న కొడుకు శ్రీనివాసులు శనివారం రోడ్డుపై వదిలేసి వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో కుమారుడు, కుమార్తెలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినా వారు తల్లిని తమతో పాటు తీసుకెళ్లేందుకు నిరాకరించారు. అందుకే వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఆర్డీవోకు సమాచారం ఇచ్చామన్నారు. కుమారుడు, కుమార్తెలను మంగళవారం ఆర్డీఓ కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న వృద్ధురాలు తిరుపతమ్మ కోలుకున్నాక అనాథ ఆశ్రమానికి తరలిస్తామని తెలిపారు.

డ్వాక్రా మహిళల అభివృద్ధికి ప్రణాళిక

● డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల అభివృద్ధికి వంద రోజుల ప్రణాళికతో ముందుకు సాగాలని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య సూచించారు. డీఆర్‌డీఏ-వెలుగు కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సోమవారం సమీక్ష నిర్వహించారు. జీవనోపాధుల పెంపునకు ఓఎన్‌డీసీ కింద జిల్లాకు 1319 యూనిట్లు టార్గెట్ ఇచ్చారని, ఇప్పటి వరకు 400 యూనిట్లను గుర్తించామని తెలిపారు. మిగిలినవి నెలాఖరులోపు పూర్తి చేయాలని సూచించారు. ఉన్నతి కింద ఎస్టీ మహిళలకు 869 పెరటికోళ్ల పెంపకం యూనిట్లు కేటాయించారని, ఇప్పటి వరకు 763 యూనిట్లు గుర్తించామని తెలిపారు. రూ.6 వేల యూనిట్‌కు రూ.3,600 సబ్సిడీతో ట్రైకార్ నుంచి రూ.45.78 లక్షలు నిధులు కేటాయించారని తెలిపారు. ఉన్నతికింద ఎస్టీ మహిళలకు రూ.3 కోట్లు, ఎస్సీ మహిళలకు రూ.12 కోట్లు వడ్డీలేని రుణాలు ఇస్తామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల గ్రేడింగ్ శాతాన్ని పెంచాలని, అట్టడుగు సంఘాలను బలోపేతం చేయడానికి అన్ని విభాగాల్లో పురోగతి సాధించాలని సూచించారు. వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేసి, డ్వాక్రా సంఘాలకు పూర్వవైభవం తీసుకురావాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఉన్న డీఆర్‌డీఏ-వెలుగు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీక్షలో డీపీఎంలు గంగాధర్, రవీంద్రబాబు, ఏపీఎంలు అనిత, మద్దిలేటి, మంజుళ, స్త్రీనిధి మేనేజర్ హనుమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేత ఆర్ట్స్ కళాశాల

● ముగిసిన ఇంటర్ కాలేజ్ మహిళల క్రీడా పోటీలు



బ్యాడ్మింటన్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ జెస్సీ

గుంతకల్లుటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ కాలేజ్ మహిళల క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. బాల్‌బాడ్మింటన్ పోటీల్లో ఆర్ట్స్ కళాశాల విజేతగా, కేఎస్ఎన్ అనంతపురం కళాశాల రన్నర్‌గా నిలిచాయి. బ్యాడ్మింటన్‌లో శ్రీశంకరానందగిరిస్వామి కళాశాల విన్నర్‌గా, అనంతపురం శ్రీవాణి కళాశాల రన్నర్‌గా నిలిచాయి. టెబుల్‌టెన్నిస్‌లో కదిరి ఎస్‌టీఎస్ఎన్ కళాశాల విన్నర్‌గా, అనంతపురం శ్రీవాణి కళాశాల రన్నర్‌గా నిలిచాయి. వాలీబాల్‌లో అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ కళాశాల విన్నర్‌గా, అనంతపురంలోని ఎస్ఎల్ఎన్ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. ఖోఖో శ్రీశంకరానందగిరిస్వామి కళాశాల విన్నర్‌గా, అనంతపురంలోని ఎస్కేయూ రన్నర్‌గా నిలిచాయి. చెస్‌లో అనంతపురంలోని ఎస్‌వీడీఎస్ విన్నర్‌గా, అనంతపురంలో కేఎస్ఎన్‌జీడీసీ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. కబడ్డీలో అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల విన్నర్‌గా, అనంతపురంలోని కేఎస్ఎన్‌జీడీసీ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. బాస్కెట్‌బాల్‌లో హిందూపురంలోని ఎస్‌డీజీఎస్ కళాశాల విన్నర్‌గా, అనంతపురంలోని ఎస్కేయూ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. వీరికి ఎస్కే యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ డాక్టర్ బీ జెస్సీ చేతుల మీదుగా ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, కళాశాల పీడీ మహబుబ్ బాషా, కళాశాల అధ్యాపకులు, వివిధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.



పాసింగ్ ఔట్ పరేడ్‌కు ఏర్పాట్లు చేస్తున్న పోలీసులు

నేడు డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్

అనంతపురం క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో మంగళవారం డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్ జరగనుంది. రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. హోం మంత్రి ఇప్పటికే అనంతపురం చేరుకున్నారు. అనంతపురం పీటీసీలో 2023 బ్యాచ్‌కు చెందిన 12 మంది డీఎస్పీలు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరిలో ఏడుగురు మహిళా డీఎస్పీలు ఉండటం విశేషం. పాసింగ్ ఔట్ పరేడ్ మంగళవారం ఉదయం 9 గంటలకు మొదలౌతుంది.

అక్రమ డెప్యుటేషన్లపై ఆర్జేడీ విచారణ



విచారిస్తున్న కడప ప్రాంతీయ వైద్యాధికారి రామగిడ్డయ్య

అనంతపురం టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో అక్రమ డెప్యుటేషన్లపై అనేకమంది కొనసాగుతున్నారనే ఫిర్యాదులపై కడప ప్రాంతీయ వైద్యాధికారి(ఆర్జేడీ) రామగిడ్డయ్య విచారణ చేశారు. వైద్య శాఖ కమిషనర్ ఆదే శాల మేరకు ఆయన సోమవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయానికి వచ్చారు. డీఎం హెచ్‌ఓ డాక్టర్ ఈబీదేవి, ఏఓ గిరిజా మనోహర్‌ల ద్వారా జిల్లా కార్యాలయంలో ఎంతమంది డెప్యుటేషన్లపై ఉన్నారు? ఎక్కడ పనిచేస్తున్నారు? ఇక్కడ ఎంతకాలం నుంచి పనిచేస్తున్నారు? ఎలాంటి ఉత్తర్వులు ఇచ్చారు? రికార్డులలో ఏమని నమోదు చేశారు? వారిహాజరు ఎలా పరిగణించారు? తదితర వివరాలను తెలుసుకున్నారు. అక్రమంగా ఎవరిని డెప్యుటేషన్లు వేసుకోలేదని, కార్యక్రమాల నిర్వహణ సమయంలో కొంతమందిని తాత్కాలికంగా నియమించుకొని పనిచేయించుకుంటు న్నట్లు డీఎంహెచ్‌ఓ, ఏఓలు వివరించారు. అనంతరం ఎన్జీఓ నాయకులు విచారణాధికారిని కలిసి పని సర్దుబాటుకు మాత్రమే కొందరిని నియమించుకున్నారని అక్రమ డెప్యుటేషన్లు లేవని వినతి పత్రం అందజేశారు. కాగా తాత్కాలిక ఆర్డర్లు పొందినవారు ఇక్కడ పనిలేకపోయినా కొందరు ఆఫీస్‌లో ఉంటూ కాలక్షేపం చేస్తున్నారనే ఆరోపణలు ఉండేవి. విచారణాధికారి వస్తున్నారనే సమాచారంతో వాళ్లంత తమ ప్లేస్‌కు వెళ్లి పోవడం గమనార్హం. ఇక్కడ సేకరించిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు పంపుతానని విచారణాధికారి రామగిడ్డయ్య మీడియాకు తెలిపారు.

నీళ్లకు నిధులివ్వాలి

● బడ్జెట్‌లో రూ.ఏడువేల కోట్లు కేటాయించాలి: సీపీఎం

అనంతపురం కల్చరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా సాగునీటి వనరుల అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.ఏడువేల కోట్లు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. తుంగభద్ర ఎగువ కాలువ(హెచ్చెల్సీ) ఆధునికీకరణ పనులు పూర్తి చేయడానికి దాదాపు రూ.500కోట్లు అవసరమని నిపుణులు అంచనా వేశారన్నారు. ఈ నిధులను బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు. తుంగభద్ర డ్యాంకు కొత్తగేట్లు ఏర్పాటు చేయడానికి దాదాపు రూ.2100కోట్లు ఖర్చవుతుందని కేంద్ర జలవనరుల శాఖ అధికారులు అంచనా వేశారన్నారు. కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరిపి కొత్తగేట్ల నిర్మాణానికి మన వాటా నిధులు ఇవ్వాలని కోరారు. హంద్రీనీవా పంట కాలువల నిర్మాణానికి రూ.1200కోట్లు కేటాయించి వెంటనే పూర్తి చేయాలన్నారు. కాలువ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచేందుకు రూ.2వేలకోట్లు ఖర్చవుతుందని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. ఉంతకల్లు జలాశయ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని, బీటీ ప్రాజెక్టుకు జీడిపల్లి నుంచి మొదలు పెట్టిన ఎత్తిపోతల పథకాన్ని వెంటనే ప్రారంభించాలన్నారు.

ఎస్‌జీఎఫ్ చెస్ పోటీలకు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల కర్నూలులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్-19 రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులు ఆదిత్యరెడ్డి, హన్నీస్టీఫెన్, మిస్బా, విశ్వనాథ్, సాయితరుణ్, అనన్య, అభిగ్న, భువనకృతి, సాహోఅఫ్రీన్‌లు ఈనెల 19 నుంచి కోల్‌కతాలో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ చెస్ క్రీడా పోటీల్లో పాల్గొనను న్నారు. ఈ క్రీడాకారులను సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్ఓ మలోల అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ షఫీ, చెస్ కోచ్ హుస్సేన్‌ఖాన్, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులను సన్మానిస్తున్న జేసీ, అసిస్టెంట్ కలెక్టర్

న్యూస్ బాక్స్

నాణ్యతలో రాజీ వద్దు

● క్యూసీ ఈఈ మల్లికార్జునమూర్తి



సమీక్షిస్తున్న ఈఈ మల్లికార్జునమూర్తి

అనంతపురం సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పనుల నాణ్యతలో ఏమాత్రం రాజీ పడవద్దని క్వాలిటీ కంట్రోల్ విభాగం (క్యూసీ) ఈఈ మల్లికార్జునమూర్తి స్పష్టం చేశారు. స్థానిక తన చాంబర్‌లో సోమవారం ఆయన అనంతపురం-1, 2, పెనుకొండ, కదిరి క్యూసీ విభాగాల డీఈఈలు, జేఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా ప్రాంతాల వారిగా రికార్డులు, పనులు తదతర అంశాలపై ఆరా తీసి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ తమ విధుల్లో బాధ్యతగా పని చేయాలన్నారు. ఎప్పటికప్పుడు క్యూసీ రిపోర్ట్‌లు అందించేలా చూడాలన్నా రు. కార్యక్రమంలో డీఈఈలు రవీంద్ర, లోకన్న, నాగశేఖర్, విశ్వనాథరెడ్డి, పలువురు జేఈలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల కోసం ఓ యాప్



యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఏడీఆర్ఎం

గుంతకల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మిక సంఘ గుర్తింపు కోసం వచ్చేనెల నిర్వహించనున్న పోలింగ్‌లో రైల్వే ఉద్యోగుల ఓటు ఎక్కడుందో తెలిపే యాప్‌ను రైల్వే అధికారులు సోమవారం ఆవిష్కరించారు. రైల్వే డివిజన్‌లో పని చేస్తున్న రైల్వే ఉద్యోగులు తమ ఓటు ఏ బూత్‌లో ఉందో తెలుసుకోవడానికి ఉపయోగపడే వేర్ ఈజ్ మై ఓట్ అనే యాప్‌ను ఈడీఆర్ఎం సుధాకర్ లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబరు 4, 5, 6 తేదీల్లో దేశవ్యాప్తంగా కార్మిక సంఘ గుర్తింపు కోసం పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు వేర్ ఈజ్ మై ఓట్ యాప్‌లో తన పీఎఫ్ ఖాతా నంబరును నమోదుచేస్తే ఉద్యోగి పేరు, డిసిగ్నేషన్ వివరాలతో ఆ ఉద్యోగి ఓటు ఏ బూత్‌లో ఉందో తెలుస్తుందని, ఆ వివరాలు చూపి ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీపీఓ జేఎస్ చౌహాన్, ఏపీఓ రంజిత్ కుమార్, సంపత్ పాల్గొన్నారు.

10న ఉచిత డీఎస్సీ కోచింగ్ స్క్రీనింగ్ టెస్ట్

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అందించే ఉచిత డీ ఎస్సీ శిక్షణకు సంబంధించిన స్క్రీనింగ్ టెస్టును ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి అభ్యర్థి పరీక్షకు హాజరుకావాలని కోరారు.

ఏపీ ఉర్దూ అకాడమీ కార్యాలయం మార్పు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రఘువీరా కాంప్లెక్స్‌లో ఉన్న ఏపీ ఉర్దూ అకాడమీ కార్యాలయాన్ని మార్పు చేసినట్లు మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కంప్యూటర్ సెంటర్, ఉర్దూ లైబ్రరీలను పాతూరులోని కేఎం సైఫుల్లా కాంప్లెక్స్‌లోని 2వ ఫ్లోర్‌లోకి మార్చినట్లు తెలిపారు. మైనార్టీ విద్యార్థులు ఈ మార్పును గమనించాలని కోరారు.

నేటి నుంచి ఎంపీడీఓలు, ఈఓఆర్డీలకు శిక్షణ

అనంతపురం విద్య, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు, పంచాయతీ సెక్రెటరీలు, డిజిటల్ అసిస్టెంట్లకు నాలుగు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో శిక్షణ ఇస్తామన్నారు. 5,6 తేదీల్లో ఉమ్మడి జిల్లా ఎంపీడీఓలకు, అనంతపురం జిలాల పరిధిలోని పంచాయతీ సెక్రెటరీలకు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఉంటుందన్నారు. 7,8 తేదీల్లో ఉమ్మడి జిల్లాలోని ఈఓఆర్డీలకు, శ్రీసత్యసాయి జిల్లా పంచాయతీ సెక్రెటరీలకు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయండి: సీఎఫ్

అనంతపురం న్యూటౌన్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): అనంతపురం సర్కిల్ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ యశోద బాయి సిబ్బందిని ఆదేశించారు. జిల్లా కేంద్రానికి సోమవారం వచ్చిన ఆమె సర్కిల్ పరిధిలోని సిబ్బందితో సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఉపాధి పథకం కింద ఏఏ పనులు చేపడుతున్నారని సిబ్బందితో ఆరాతీశారు. అనంతరం ఇన్‌చార్జ్ డీఎఫ్ఓ ఆనంద్‌కు పలు ఆదేశాలు జారీ చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఆలూరి బైరాగి (జయంతి)



ప్రముఖ రచయిత, తెలుగు కవి ఆలూరి బైరాగి 1925 నవంబరు 5న తెనాలి తాలూకాలో జన్మించారు. 15వ యేట హిందీలో కవితలు రాసి కవి సమ్మేళనాలలో పాల్గొన్నారు. ఆయన తొలి కవితా సంకలనం 'చీకటి నీడలు' ప్రచురించారు. మానవతావాదిగా పేరొందిన ఆయన 1978 సెప్టెంబరు 9న కన్నుమూశారు. మరణానంతరం 1984లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించారు.

దాశరథి (వర్ధంతి)



'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని గర్వంగా ప్రకటించి ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిన కవి, 'కళా ప్రపూర్ణ' బిరుదాంకితులు దాశరథి కృష్ణమాచార్య వరంగల్ జిల్లా చిన్నగూడూరు 1925 జూలై 22న జన్మించారు. తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'గా మలిచి నిజాంపాలనపై ఎక్కుపెట్టిన మహాకవి దాశరథి. పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకుని తెలంగాణ విముక్తికోసం ఉద్యమించిన ప్రాతః స్మరణీయుడు. ఉపాధ్యాయుడిగా, పంచాయతీ ఇన్‌స్పెక్టర్‌గా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేసినా సాహిత్యంలో పలు ప్రయోగాలు చేశారు. కేంద్ర, రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు అందుకున్నారు. 1987 నవంబరు 5న కన్నుమూశారు.

వందన శివ (పుట్టినరోజు)



భారతీయ పండితురాలు, పర్యావరణ కార్యకర్తగా పేరొందిన వందన శివ 1952 నవంబరు 5న డెహ్రాడూన్‌లో జన్మించారు. ప్రపంచీకరణ వ్యతిరేక రచయిత. 20 కుపైగా పుస్తకాలను రచించారు. రైట్ లైవ్లీహుడ్ అవార్డు అందుకున్నారు. ఈ పురస్కారాన్ని 'ప్రత్యామ్నాయ నోబెల్ అవార్డు'గా పరిగణిస్తారు. సుస్థిర జీవనంకోసం బీజా విద్యాపీఠ్ అనే అంతర్జాతీయ కళాశాలను ప్రారంభించారు.

విరాట్‌కోహ్లి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత, అంతర్జాతీయ క్రికెటర్ విరాట్ కోహ్లి 1988 నవంబరు 5న జన్మించారు. అండర్ 19 కేటగిరీలో మలేషియాలో 2008లో ప్రపంచకప్ విజయంలో భారత జట్టుకు సారథిగా వ్యవహరించారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఢిల్లీ జట్టుకు ప్రాతినిథ్యం వహించారు. మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్, ఓపెనింగ్ బ్యాట్స్‌మన్‌గా కూడా ఆడగలడం ప్రత్యేకత. టెస్ట్ క్రికెట్ కేప్టెన్‌గాను వ్యవహరించారు. ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడారు. పలు స్వచ్ఛంద సంస్థలతో కలసి సామాజిక సేవలందిస్తున్నారు. 2024 టి20 వరల్డ్‌కప్‌లో ఇండియా విజయం సాధించాక ఆయన టి 20 ఇంటర్నేషనల్ ఫార్మాట్‌లో రిటైర్మెంట్ ప్రకటించారు.

కేఆర్ఎస్ బ్యాక్‌వాటర్‌లో 'సీ ప్లేన్' సంచారం

ఈనెల 10న ప్రయోగాత్మకంగా ఏర్పాట్లు



సీ ప్లేన్ (ఫైల్)

బెంగళూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారి నీటిపై విమానం ప్రయోగాత్మకంగా సంచరించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. సాధారణంగా విమానం ఆకాశంలో విహరించడం తెలిసిందే. పలు దేశాలలో నీటిపైనుంచే విమానం ముందుకు కదిలేలాంటి ప్రయోగాలు చేశారు. అటువంటిదే మండ్య జిల్లా కేఆర్ఎస్ ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ వేణుగోపాలస్వామి దేవస్థానం వద్ద ప్రయోగాత్మకంగా సంచరించేందుకు నిర్ణయించారు. కేంద్రప్రభుత్వ విమానయాన సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రంలో పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి మండలితోపాటు వివిధశాఖల సంయుక్త సహకారంతో ఈనెల 10న ప్రయోగాత్మకంగా అమలు చేయదలిచారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా జల విమానం సంచారాన్ని ఆరంభించనున్నారు. 12మంది పర్యాటకులతో తొలిసారి 'సీ ప్లేన్' కేఆర్ఎస్ బ్యాక్‌వాటర్‌లో నాలుగుసార్లు సంచరించనుంది. నీటిపైనే సంచరించడం, అక్కడే ల్యాండ్ కావడం ఈ విమానం ప్రత్యేకం. మైసూరులోని మండకళ్ళి విమానాశ్రయాన్ని కేంద్రంగా ఉపయోగించుకోదలిచారు. 2020లో గుజరాత్‌లోని నర్మదా జిల్లా సబర్మతి నదిలో తొలిసారి జల విమాన సేవలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరంభించారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్, కేరళలోనూ విజయవంతంగా పరిచయం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అవకాశం కల్పిస్తున్నారు. ఉడాన్ పథకంలో భాగంగా సేవలను కొనసాగించే ఆలోచనలో ఉన్నారు. ప్రయాణీకులు విమానంలో ప్రవేశించేందుకు, దిగేందుకు కేఆర్ఎస్ జలాశయంలో తేలుతున్న బ్రిడ్జ్‌ను కర్ణాటక జలరవాణా మండలి ఏర్పాటు చేయనుంది. పార్కింగ్, సురక్షిత బాధ్యతలను, లింక్ రోడ్డును ప్రజాపనులశాఖ కల్పించనుంది. విమానం ల్యాండింగ్, ఇతర లాజిస్టిక్స్ బాధ్యతలను మైసూరు ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ పర్యవేక్షించనున్నట్లు కర్ణాటక స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు. సీ ప్లేన్ నిపుణుల బృందం ఇప్పటికే వేణుగోపాలస్వామి ఆనందూరు వద్ద పరిశీలన జరిపారు. పది అడుగుల లోతు, 1.5 కిలోమీటర్ల వెడల్పుతో నీటి పరిస్థితిని అంచనా వేసుకుని సాంకేతిక అంశాలపైనా కావేరి బోర్డు ఇంజనీర్లతో సమాచారం సేకరించారు. ప్రయోగాత్మకం విజయవంతమైతే జల విమానసేవలు స్థానిక పర్యాటకులకు ఆకర్షణ కానున్నాయి. కేఆర్ఎస్ ప్రాజెక్ట్, బృందావన్ గార్డెన్స్‌లను అంతర్జాతీయ స్థాయిలో పర్యాటకులను ఆకర్షించనుంది.



కేఆర్ఎస్ బ్యాక్‌వాటర్ ప్రదేశంలో వేణుగోపాలస్వామి ఆలయం

21 నుంచి సీపీఎం జిల్లా సమ్మేళనం



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

బాగేపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లాస్థాయి సమ్మేళనం ఈనెల 21, 22తేదీలలో పట్టణ శివారులోని కొండంవారిపల్లి ఎస్ఎల్ఎన్ కల్యాణమండపంలో జరగనుందని సీపీఎం కార్యదర్శి వాల్మీకి అశ్వత్థప్ప వెల్లడించారు. సమ్మేళనం విజయవంతం చేసేందుకు విరాళాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. సోమవారం పట్టణవ్యాప్తంగా దుకాణాలు ఇతరులనుంచి విరాళాల సేకరణకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కృష్ణానది నీటిని చిక్కబళ్లాపుర జిల్లాకు మళ్లించి శాశ్వత నీరావరి పథకాన్ని కల్పించి జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ ఉపాధి అవకాశం కల్పించడం, పేదలకు భూమి ఇళ్లు కల్పించడమే లక్ష్యంగా జిల్లా సర్వతోముఖాభివృద్ధికోసం 18వ జిల్లాస్థాయి సమ్మేళనం జరగనుందన్నారు. సీపీఎం కోశాధికారి ఎంఎస్ రఘురామరెడ్డి మాట్లాడుతూ సీపీఎం పార్టీ 70ఏళ్లలో జిల్లా ప్రజల సర్వతోముఖాభివృద్ధి కోసం నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. జిల్లాలో వర్షాలు ఆశాజనకంగా కురవకపోవడంతో రైతులు దివాళా స్థితిలో ఉన్నారని, మరోవైపు తాలూకాలో నిరుద్యోగ సమస్య అధికంగా ఉందని అభిప్రాయపడ్డారు. అన్నదాతలు, సామాన్యుల సమస్యలపై సమ్మేళనం ప్రత్యేకదృష్టి సారిస్తుందన్నారు. ఈ సందర్భంగా నాగరాజు, సీఐటీయు ముఖ్యుడు ముస్తఫా, సీపీఎం ప్రముఖుడు మునియప్ప, జి కృష్ణప్ప, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కాశీ విశ్వనాథస్వామి ఆలయ కుంభాభిషేకం

మహదేవపుర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బిదరహళ్ళిలో పురాతనమైన కాశీవిశ్వనాథస్వామి ఆలయ కుంభాభిషేకం, శిఖర కళశ ప్రతిష్ఠాపనా కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉడుపి పెజావర మఠం విశ్వ ప్రసన్నతీర్థ స్వామిజీ సాన్నిధ్యం వహించారు. ఆలయానికి సుమారు 700 సంవత్సరాల చరిత్ర ఉంది. కార్తీక సోమవారం కావడంతో ప్రత్యేకంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. స్థానికంగా దక్షిణ కాశీగా ఈ ఆలయం ప్రసిద్ధి చెందింది. మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, రజత కవచధారణ, పుష్పాలంకరణ చేశారు. మూడోసారి ఆలయాన్ని జీర్ణోదరణ చేసినట్టు ఆలయ ట్రస్టు సభ్యులు తెలిపారు. ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మంజుళా, మాజీ మంత్రి అరవింద లింబావళి దంపతులు పాల్గొని స్వామిజీని ఆత్మీయంగా సత్కరించారు. వందలాదిమంది భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ హోబళి బీజేపీ అధ్యక్షుడు బిఎన్ నటరాజ్, స్థానిక ప్రముఖులు గణేశ్, ధనంజయ, ఆలయ ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఉడుపి పెజావర స్వామీజీకి సన్మానం

మంజునాథస్వామికి కార్తీక పూజలు



పూజల్లో ట్రస్టు ఉపాధ్యక్షుడు ముఖేశ్‌వర్మ, భక్తులు

బొమ్మనహళ్ళి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అరికెరె శాంతి నికేతన్ లే అవుట్‌లోని శాంతి దామలో వెలసిన మంజునాథ స్వామి ఆలయంలో కార్తీక సోమవారం పురస్కరించుకుని విశేషపూజలు కొనసాగాయి. అభిషేకం అనంతరం స్వామి వారికి వెండి నాగపడగ ధారణలో దర్శనమిచ్చారు. కార్తీకమాసంలో ప్రతిరోజూ కూడా స్వామివారికి అభిషేకం, అలంకరణ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. విశేష పూజల్లో ట్రస్టు ఉపాధ్యక్షుడు ముఖేశ్‌వర్మ కుటుంబీకులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం 8 గంటలనుంచి భక్తులకు క్షీరాభిషేకానికి అవకాశం కల్పించారు. 11న స్వామివారికి లక్ష బిళ్వార్చన, 15న కార్తీక పౌర్ణమికి లక్ష దీపోత్సవం, సత్యనారాయణ స్వామి పూజ, ఇతర ప్రత్యేక పూజలు కొనసాగుతాయన్నారు. ఆసక్తిగలవారు ముందుగా నమోదు చేసుకోవాలని, భక్తులకు నేతి దీపాలు, 365 వత్తుల దీపాలు అందుబాటులో ఉంటాయని ఆలయ ట్రస్టు అధ్యక్షుడు మేడా రామకృష్ణ వెల్లడించారు. డిసెంబరు 1న అమావాస్యరోజున స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు తాతయ్యగుప్త, కృష్ణయ్యశెట్టి, టిజివి గుప్త, సత్యనారాయణ శెట్టి తదితరులు పాల్గొన్నారు.



పాతభవనం తొలగింపు వేళ రంగరామయ్య తదితరులు

పాతభవనం తొలగింపు

బంగారపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాలూకాలో సుమారు నాలుగు దశాబ్దాల చరిత్ర ఉన్న కన్నడ సంఘం భవనం పాత బడడంతో తొలగించే ప్రక్రియను సోమవారం చేపట్టారు. పంగమ్మ నపాళ్య రోడ్డులోని కన్నడ సంఘం భవనంలో సంస్కృతిక కార్య క్రమాలు నిర్వహించేవారు. రంగరామయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే సూచనతో పాతభవనాన్ని తొలగించి రూ.2కోట్లతో నూతన భవనం నిర్మించనున్నట్టు తెలిపారు. వచ్చే ఏడాది కన్నడ రాజ్యోత్సవం నూతన భవనంలో నిర్మించే లక్ష్యం కలిగినట్టు తెలిపారు. పురసభ సభ్యుడు వెంకటేశ్ మాట్లాడుతూ తాలూకాలో కన్నడ కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుగా ఆధునాతన భవనం నిర్మించనుఎన్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పురసభ అధ్యక్షుడు గోవింద, సభ్యుడు బాబులాల్బ, కర్ణాటక రక్షణా వేదిక అధ్యక్షుడు చిన్ని వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ ఇష్యూలోకి స్విగ్గీ

బెంగళూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బెంగళూరు కేంద్రంగా ఆరంభమై జాతీయస్థాయిలో ఇ-కామర్స్ ద్వారా రాణిస్తున్న స్విగ్గీ సంస్థ మరింత వ్యాపార విస్తరణకు పబ్లిక్‌ఇష్యూలోకి అడుగు పెట్టింది. సోమవారం నగరంలో స్విగ్గీ ఎండీ సీఈఓ శ్రీహర్ష మాజేటి, సీఎఫ్ఓ రాహుల్ బోత్రలు ఐపీఓ ఆరంభిస్తున్నట్టు వెల్లడించారు. 6వ తేదీ బుధవారం బిడ్ ఓపెన్ కానుందని 8వతేదీతో ముగియనుందన్నారు. ప్రతి ఈక్విటీ షేర్ రూ.371 నుంచి రూ.390గా నిర్ణయించామన్నారు. కనీసంగా 38 ఈక్విటీషేర్‌లను ఆ తర్వాత రెట్టింపునకు అవకాశం ఉంటుందన్నారు. 44,990 మిలియన్ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. స్విగ్గీ దేశవ్యాప్తంగా మెట్రో నగరాలతోపాటు మరో 30 పట్టణాలలో సేవలందిస్తోందన్నారు. ఏటా గణనీయంగా ప్రగతి సాధిస్తోందన్నారు.

లాన్‌ఎక్సెస్‌కు డిజిటెక్ ఫ్రంట్ పురస్కారం

బెంగళూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రసాయన రంగంలో విస్తృతంగా వ్యాపారాలు సాగిస్తున్న లాన్ ఎక్సెస్ సంస్థకు ఫిక్కీ ద్వారా కెమికల్, పెట్రో కెమికల్స్ విభాగంలో డిజిటెక్ ఫ్రంట్ రన్నర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారానికి ఎంపికైంది. కేంద్ర ప్రభుత్వ రసాయన, ఎరువుల మంత్రిత్వశాఖ కార్యదర్శి నివేదిత శుక్లా, సహాయ మంత్రి అనుప్రియ పటేల్‌ల ద్వారా పురస్కారం లభించినట్టు బెంగళూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. లాన్ ఎక్సెస్ ఇండియా ఎండీ నమితేశ్‌రాయ్ చౌదరి అభిప్రాయం మేరకు రసాయనిక, పెట్రో కెమికల్స్ విభాగంలో జాతీయస్థాయిలో ఉత్తమ పురస్కారం దక్కడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) ద్వారా పురస్కారం ఉద్యోగులందరి విజయమని అభిప్రాయపడ్డారు.

200 మందికిపైగా బాధితులు

బెంగళూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ ఇంటింటా సంబర మైనా టపాసుల పేల్చేవేళ జాగ్రత్తలు పాటించకపోవడంతో నగరవ్యాప్తంగా 200 మందికిపైగా గాయపడ్డారు. వీరిలో ఎక్కువమంది చిన్నారులు ఉన్నారు. మింటో ఆసుపత్రిలో 50మందికి చికిత్సలు అందించినట్టు తెలిపారు. శంకర్ కంటి ఆసుపత్రిలో 18మందికి చికిత్సలు అందించగా వీరిలో 14మంది చిన్నారులు ఉన్నారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రిలో 9మందికి చికిత్సలు అందించగా ఆరుగురు చిన్నారులు ఉన్నారు.

నారాయణ నేత్రాలయలో 76మందికి చికిత్స

నారాయణ నేత్రాలయలో ఇప్పటివరకు 76మందికి చికిత్సలు అందించినట్టు ఆసుపత్రి సీఈఓ కేప్టెన్ ఎస్‌కే మిత్తల్ తెలిపారు. వీరిలో 40మంది పెద్దలు ఉండగా 36మంది పిల్లలు ఉన్నారు. పదేళ్లలోపు వారు 14మంది ఉండగా, 18ఏళ్లలోపువారు 22మంది ఉన్నారు. 56మంది పురుషులు, 20మంది మహిళలు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

నల్లమాడ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాపణ కుంట ఎస్సీ కాలనీకి చెందిన పులేటి చిరంజీవి (36) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరు నెలలుగా కడుపునొప్పితో బాధపడు తున్న అతను పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా.. ఫలితం లేకుండా పోయింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతను సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చిరంజీవికి భార్య పార్వతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి

నంబులపూలకుంట, నవంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజపల్లి పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి (34) గుండెపోటులో సోమవారం మృతిచెందారు ఇటీవల బదిలీలో భాగంగా బలిజపల్లికి బదిలీపై వచ్చారు.

అపార్ అవస్థలు

ధర్మవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీలో విద్యార్థుల అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ టీచర్లకు తలనొప్పిగా మారింది. పాఠశాల అడ్మిషన్ రిజిస్టర్, ఆధార్, యూడైస్‌లో విద్యార్థులకు సంబంధించి ఒకే సమాచారం ఉండాలన్న నిబంధన కొత్త సమస్యలను తెచ్చిపెట్టింది. ముందుగా 9, 10 తరగతుల వారికి మాత్రమే అపార్ ఐడీ అన్న ప్రభుత్వం.. తాజాగా 1 నుంచి 10వ తరగతి వరకు అందరికీ అమలు చేస్తోంది. దీంతో టీచర్లకు సమస్య మొదలైంది. విద్యార్థుల వివరాలు పాఠశాల రికార్డుల్లో ఒకలా.. ఆధార్‌లో మరోలా ఉన్నాయి. పుట్టిన తేదీ వివరాలు సచివాలయంలో ఇంకోలా ఉన్నాయి. కొందరు విద్యార్థుల ఇంటి పేరు కూడా ఆధార్‌లో పూర్తిగా లేదు.

- కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానం 2020 అమలులో భాగంగా ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ అవసరమని తేల్చిచెప్పింది. ఇప్పటికే విద్యార్థులకు పిన్ నంబర్లను కేటాయించగా కొత్తగా అపార్‌ను ప్రవేశపెట్టింది. ఈ నంబరు సృష్టించేందుకు క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తిప్పలు పడుతున్నారు. అపార్ పేరుతో ఆన్‌లైన్‌లో ప్రతి విద్యార్థికి ఒక నంబరు కేటాయిస్తారు. అందులోనే ఆ విద్యార్థికి సంబంధించి విద్యా విషయాలు, నైపుణ్యాలు పొందుపరుస్తారు. ఈ నంబరు కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు మూడు రకాల రికార్డుల్లో విద్యార్థుల వివరాలు ఒకేలా ఉండాలి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో అపార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. మొత్తం జిల్లావ్యాప్తంగా 2,41, 641 మంది విద్యార్థులున్నారు. ఇప్పటి వరకు 1,08,957 మంది అపార్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.
- ప్రస్తుతం పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న వారిలో కొందరి వివరాలు గందరగోళంగా ఉన్నాయి. ఒక విద్యార్థికి మూడు రకాల పుట్టిన తేదీలు ఉండటం సమస్యగా మారింది. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి 1వ తరగతిలో చేరేటపుడు తల్లిదండ్రులు చెప్పిన విధంగా ప్రధానోపాధ్యాయులు పుట్టిన తేదీ ఇతర వివరాలను అడ్మిషన్ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. వాటినే హైస్కూల్‌లో 6వ తరగతిలో చేరినపుడు అక్కడి అడ్మిషన్ రిజిస్టర్‌లోనూ కొనసాగిస్తారు. పంచాయతీ, మున్సిపాలిటీల్లో పిల్లల జనన రిజిస్టర్‌లో మరో పుట్టిన తేదీతో వారి వివరాలు నమోదవుతున్నాయి. ఆధార్ నంబరులో విద్యార్థుల పుట్టిన తేదీ లేకుండా కేవలం సంవత్సరం మాత్రమే ఉంటుంది. ఈ నేపథ్యంలో పుట్టిన తేదీల్లో దేనిని ప్రామాణికంగా తీసుకోవాలో అర్థంకాక టీచర్లు గందరగోళం చెందుతున్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం 9వ తరగతి వరకు పుట్టినతేదీ మార్చే అధికారం డీఈఓలకు ఉంది. పదో తరగతి వారికి ఆర్జేడీ చేయాలి. అటు కార్యాలయాలు, అటు సచివాలయాల్లోని ఆధార్ కేంద్రాల చుట్టూ తల్లిదండ్రులు, టీచర్లు ప్రదక్షిణ చేస్తున్నారు.



లక్ష్మీపతి స్వామి

పట్టణంలో ట్యాటూ స్వామి

బాగేపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సనాతన హిందూ ధర్మాన్ని ప్రచారం చేస్తున్న ట్యాటూ స్వామిగా పేరొందిన లక్ష్మీపతిస్వామి పట్టణానికి సోమవారం విచ్చేశారు. మైసూరు జిల్లా హుణసూరుకు చెందిన లక్ష్మీపతిస్వామి 2016 నుంచి హిందూ ధర్మంపై పాదయాత్రగా ప్రచారం చేస్తున్నారు. విశ్వశాంతి, సమాజంలో మార్పుకోసం ఆయన ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ సహా 8 రాష్ట్రాల్లో పాదయాత్ర చేశారు. ఉడుపి నుంచి ఆయన బాగేపల్లికి చేరుకున్నారు. పట్టణం లోని గంగమ్మదేవి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయన తన చేతులు, ఒంటిపై వివిధ దేవతల పచ్చబొట్లు వేసుకోవడం ద్వారా ట్యాటూ స్వామిగా పేరొందారు. ఇలా 35 ట్యాటూలు ఉన్నాయి. సూర్యచంద్రులు, వెంకటేశ్వరస్వామి, నరసింహ స్వామి, శివుడు, కాళికాదేవి, గరుడ, హనుమాన్, రంగనాథ్ తదితర దేవతల ట్యాటూలు ఉన్నాయి. బెంగళూరుకు చెందిన ట్యాటూ కళాకారుడి ద్వారా ట్యాటూ వేయించుకున్నట్టు ఆయన తెలిపారు. ట్యాటూ స్వామి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి, పురసభ మాజీ అధ్యక్షుడు బీఆర్ నరసింహ నాయుడు తదితరులు ఉన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

ధర్మవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఓ కారు అదుపు తప్పి.. రోడ్డు పక్కన పొలంలోని కాలువలోకి దూసుకెళ్లింది. ధర్మవరం నుంచి ఇద్దరు యువకులు కారులో అనంతపురం వెళ్తుండగా.. వేగంగా వెళ్త న్న ఆ కారు అదుపు తప్పి. పంట పొలాలోని కాలువలోకి దూసుకె ళ్లింది. గమనించిన చుట్టు పక్కన పొలాల్లోని రైతులు, కూలీలు ఆ కారును తాడుతో మరో వాహనానికి కట్టి బయటకు సురక్షి తంగా లాగారు. కారులో ఉన్న యువకులకు ఎటువంటి గాయాలూ కాలేదు.

అన్నింటిని కరువు మండలాలుగా ప్రకటించాలి

ధర్మవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మూడు మండలాలను మాత్రమే కరువు మండలాల జాబితాలో చేర్చారని, కానీ నియోజకవర్గంలో అన్ని మండలాల్లోనూ తీవ్ర కరువు పరిస్థి తులు ఉన్నాయని, అన్నింటినీ కరువు మండలాలు ప్రకటించాలని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ కోరారు. ఈ మేరకు పుట్టపర్తిలోని సాయి ఆరామం ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన ఎన్డీఏ ముఖ్యనాయకులతో జరిగిన సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను విజ్ఞప్తి చేశారు. గతనెల 21న కురిసిన భారీ వర్షాలకు రైతులు, చేనేతలు సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోయారని వారికి పరిహారం అందేలా చూడాలని విన్నవించారు. హౌసింగ్ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన తుంపర్తి రైతులకు న్యాయం చేయాలని, ముదిగుబ్బ మండలంలోని జిల్లేడుబండ్ల రిజర్వాయర్ కోసం భూములిచ్చిన రైతులకు నేటి ధరల ప్రకారం పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



జలహారతి ఇస్తున్న పరిటాల శ్రీరామ్, చిలకం మధుసూదన్‌రెడ్డి

పోతుకుంట చెరువు వద్ద జలహారతి

ధర్మవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుకుంట చెరువు వద్ద నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సోమవారం గంగపూజ చేసి జలహారతి ఇచ్చారు. శ్రీరామ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పూడిపోయిన కాల్వలకు మళ్లీ జీవం పోస్తామన్నారు. అనంతరం పోతుకుంట గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ నాయకులు చింతలపల్లి మహేశ్‌చౌదరి, మాజీ ఎంపీపీ మద్దిలేటి, కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, విజయసారధి, తలారి వెంకటలక్ష్మి, పోతలయ్య, రవి, రమేశ్, చిత్రా రామ్మోహన్, ఐటీడీపీ రాము పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,605.65
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	15,536	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	15,116	9,052
నీటి నిల్వ (టీఎంసీలు)	101.77	29.76

పేకాట స్థావరాలపై కొరడా
130 కేసుల నమోదు: ఎస్పీ


ఎస్పీ శోభారాణి

బళ్లారి సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా పేకాట స్థావరాలపై కొరడా ఝుళిపించినట్లు ఎస్పీ శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 30నుంచి నవంబరు 3వ తేది వరకు ఐదు రోజుల పాటు పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న వారిపై 130 కేసులు నమోదు చేసి 810మందిని అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈకేసుల్లో రూ. 16లక్షల 64వేల 135స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అంత్యక్రియలకూ తప్పని కష్టాలు..!

● శ్మశానానికి వెళ్లాలంటే వాగు దాటాల్సిందే.. ● ఎన్నేళ్లయినా పరిష్కారం కాని సమస్య

బళ్లారి గాంధీనగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామంలో ఎవరైనా మృతిచెందితే... అంత్యక్రియల కోసం వాగు దాటాల్సిందే. జి.నాగలాపురం గ్రామ ప్రజల కష్టాలు ఈ నాటివి కావు..ఎన్నో ఏళ్లుగా ఇదే పరిస్థితి నెలకొన్నా వారి సమస్యలను పరిష్కరించిన నాథుడు లేడు. గ్రామ శివారులో శ్మశాన వాటిక ఉండడంతో వర్షాకాలంలో వారి కష్టాలు మరింత దయనీయంగా మారుతున్నాయి. గ్రామంలో మృతి చెందిన వారికి అంత్యక్రియలు నిర్వహించాలంటే నడుములోతు వాగులో శవాన్ని ఎత్తుకుని వెళ్ళాల్సి ఉంటుందని గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఏళ్ళతరబడి ఇదే సమస్యను ఎదుర్కొంటున్నామని, అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పట్టించుకునే వారు లేరని గ్రామస్థుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుంటుందని, ఆ సమయంలో గ్రామంలో ఎవరైనా చనిపోతే వాగులో నీటి ఉధృతి తగ్గేంత వరకు శవసంస్కారాలు ఆపుకోవాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన జి.చెన్నబసప్ప(62) మృతి చెందారు. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రెండు రోజుల పాటు మృతదేహాన్ని ఇంటివద్దనే ఉంచుకుని, విధిలేని సమయంలో రెండురోజుల తర్వాత నడుములోతు వాగులో మృతదేహాన్ని భుజాలపై ఎత్తుకుని శ్మశానానికి తరలించారు. భయంతోనే వాగుదాటి శవ సంస్కారాలు నిర్వహించినట్లు గ్రామ పంచాయతీ సభ్యులు గురికార సతీష్ తెలిపారు. ఆరు వేలమంది జనసంఖ్య కలిగిన గ్రామంలో లింగాయత సమజానికి చెందిన ప్రత్యేక శ్మశానం ఉందని, ఇతర సముదాయాలకు చెందిన వారు ఎవరైనా మృతి చెందితే వాగు అవతలివైపు ఉన్న స్థలంలో అంత్యక్రియలు నిర్వహించాల్సిందేనన్నారు. కేవలం ఎన్నికల సమయం లో మాత్రమే వంతెన నిర్మాణానికి హామీ ఇస్తారని, ఆ తర్వాత పట్టించుకునే నాథుడే లేడని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


నడుము లోతు నీటిలో మృతదేహాన్ని తీసుకెళ్తున్న గ్రామస్థులు

మద్దతు ధరతో వేరుశనగ కొనుగోలు

● కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా



బళ్లారి సిటీ, నవంబరు4(ఆంధ్రజ్యోతి): మద్దతు ధరతో నాణ్యమైన వేరుశనగను బెంగళూరు స్టేట్ కోఆపరేటివ్ ఆయిల్‌సీడ్ గ్రెవర్స్ గ్రాండ్ బోర్డు రెగ్యులర్ ఏజెన్సీ ద్వారా కొనుగోలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.6,789 రైతుల నుంచి కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. రైతులు బళ్లారి ఏపీఎంసీ, ఈరేశ్ 7353155205, బళ్లారి తాలూకా ఆయిల్ సీడ్ గ్రోవర్స్ కో ఆపరేటివ్ సొసైటీకి చెందిన కప్పగల్లు గ్రామం, సండూరు ప్రాథమిక వ్యవసాయ రైతుల సహకార సంఘం శివలింగప్ప, 9980676497, చోరనూరు ప్రాథమిక వ్యవసాయ రైతు సహకారం సంఘం మలియప్ప 9945352466, కురుగోడు ప్రాథమిక వ్యవసాయ రైతుల సహకార సంఘం హుస్సేన్‌సాబు 908841654లను సంప్రదించాలన్నారు. వేరుశనగ కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ పేరు నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ కార్డు పొందాలన్నారు. నమోదుకాని రైతుల నుంచి ఎకరాకు మూడు క్వింటాళ్లు మాత్రమే, గరిష్ఠంగా ఎకరాకు 15క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామన్నారు.

మద్యం అమ్మకాలపై నిషేధం

సండూరు నియోజకవర్గంలో ఉప ఎన్నికల దృష్ట్యా మద్యం అమ్మకాలను నిషేదించినట్లు కలెక్టర్ మిశ్రా తెలిపారు. నవంబరు 13న సండూరు అసెంబ్లీ ఉప ఎన్నికలో భాగంగా పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబరు 11న సాయంత్రం 6గంటల నుంచి 14 ఉదయం 6గంటల వరకు కంప్లి, కురుగోడు , బళ్లారి తాలూకాల పరిధిలో నిషేధం ఉంటుందన్నారు.

శోభాయమానం.. తొలి సోమవారం..!


ఎర్రితాత ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


◄ప్రత్యేక అలంకరణలో ఎర్రితాత

బళ్లారిరూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా ఆలయాలు శోభాయామానంగా తయారయ్యాయి. చేళగుర్కి ఎర్రితాత ఆలయంలో కార్తీక దీపోత్సవంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో వెలసిన చేళగుర్కి ఎర్రితాతకు సన్నిధిలో భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బళ్లారి నగరంతో పాటు వివిధ గ్రామాల ప్రజలు ఇందులో పాల్గొన్నారు.

హంపి పుణ్యక్షేత్రంలో..

కంప్లి: కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా ప్రసిద్ధ పర్యాటక ప్రాంతం హంపిలో దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. విరూపాక్షేశ్వరుడి సన్నిధిలో మహిళలు దీపాలు వెలిగిస్తూ ప్రత్యేక పూజలు చేపట్టారు. హంపితో పాటు కంప్లి, కురుగోడు, పలు గ్రామాలు, పట్టణాలలో కార్తీక మాసం సందర్భంగా పూజలు చేపట్టారు. కార్తీక మాసమంతా ప్రత్యేక పూజలకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు.

ఉభయ జిల్లాలోని శైవాలయాల్లో సోమవారం శివనామస్మరణ మార్మోగిది. ఉదయం నుంచే పరమ శివుడ దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే శైవాలయాల్లో అభిషేకం, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాల్లో దీపాలు వెలిగించి మహిళలు భక్తిని చాటుకున్నారు.


హంపి దీపోత్సవంలో భక్తులు


◄ కంప్లి షుగర్ ఫ్యాక్టరీ ముక్తినాథేశ్వరాలయంలో..

భార్య గెలుపు కోసం ప్రచారం


యశ్వంత్ నగర్ ప్రచారంలో పాల్గొన్న ఎంపీ తుకారామ్

కంప్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎంపీ ఈ తుకారామ్ తన భార్య అన్నపూర్ణ గెలుపు కోసం తన వంతుగా గ్రామాల్లో పర్యటిస్తూ జోరుగా ప్రచారం నిర్వహించారు. సోమవారం ఆయన సండూరు పరిధిలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటన చేపట్టారు. యశ్వంతనగర్‌లో అభ్యర్థి అన్నపూర్ణ, ఎంపీ ఈ తుకారామ్‌లు జోరుగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ తుకారామ్ మాట్లాడుతూ సండూరులో తనను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి అవకాశం ఇచ్చారని, ఇప్పుడు తన భార్యను కూడా ఆదరించి ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చి దిద్దుతామన్నారు. బీజేపీ నాయకులు కేవలం ప్రచారానికే పరిమితమయ్యాయన్నారు. బీజేపీ ప్రభుత్వం అభివృద్ధిలో శూన్యమన్నారు. తమ నాయకుడు సిద్దరామయ్య ప్రోత్సాహంతో మహిళలు, యువకులు, విద్యార్థులకు ఎన్నో పథకాలు అందించి ఆదుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ విజయం ఖాయం: విజయేంద్ర


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర

తోరణగల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలో బీజేపీ గెలుపు కాయమని, కాంగ్రెస్ మోసాలతో ప్రజలు విసుగెత్తిపోయారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర ధీమా వ్యక్తం చేశారు. సోమవారం తోరణగల్లులోని ఓ హోటల్లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తర కర్ణాటక ప్రజలు హృదయ మంతా శ్రీమంతులని తన తండ్రి యడియూరప్పకు ఈ ప్రాంతానికి ప్రత్యేక సంబంధం ఉందన్నారు. బీజేపీ పాలనలో రైతులకు, ఇల్లులేని నిర్వాసితులకు ఇళ్ల నిర్మిస్తామన్నారు. ఇక్కడ అభివృద్ధి జరగలేదనడానికి సండూరు బస్టాండే సాక్ష్యమన్నారు. నియోజకవర్గంలో పల్లె పల్లె తిరుగుతున్నామని ఏ పల్లెలో కూడా సరైన రోడ్డు నిర్మాణం, మౌలిక సౌకర్యాలు లేవన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యే గెలిచిన వారు ఇక్కడ చేసిన అభివృద్ధి ఏమీ లేదని, వారు అభివృదిని మరిచారన్నారు. అలాగే రూ. 187 కోట్లు వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ సొమ్ము కాజేశారన్నారు. తమ పాలనలో వాల్మీకి సమాజంతో పాటు ఇతర సమాజాల వారికి ఆర్థిక సహాయం అందించామన్నారు. బంగారు హనుమంతుకు ఓటు వేసి బీజేపీని గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి, కేఎస్ దివాకర్, బీజేపీ నాయకులు పంపాపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

7 వరకు నామినేషన్లకు గడువు


విలేకరులతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి దేవేంద్రగౌడ

సిరుగుప్ప, అక్టోబరు 4 : ఈ నెల 7వ తేదీలోపు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్ష పదవికి నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం వుంటుందని ఎన్నికల అధికారి దేవేంద్ర గౌడ్ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబరు 16న జరుగనున్న అధ్యక్ష పదవికి నామినేషన్లు వేసేందుకు 7వ తేదీ చివరి తేదీ అని తెలిపారు. 11వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, 16న అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు


వేణి వీరాపురం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

కంప్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికల సందర్భంగా చెక్‌పోస్టుల్లో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అనుమతిస్తున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్లే నగదును స్వాధీనం చేసుకుని కేసులు కూడా నమోదు చేస్తున్నారు. కుడితిని సమీపంలోని వేణి వీరాపురం వద్ద బళ్లారి నుంచి కుడితిని వైపు వచ్చే వాహనాలను పోలీసులు ప్రతి ఒక్క వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. డి బసాపురం వద్ద ఆదివారం సాయంత్రం రూ. 27.50 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆర్‌ఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ అనిల్ కుమార్, ఈవో షడక్షరయ్య తెలిపారు. ఆంధ్ర నుంచి ఇటు వైపు వస్తున్న వాహనంను తనిఖీ చేయగా ఈ నగదు పట్టుబడిందని వాటికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో ఆ డబ్బును స్వాధీనం చేసుకున్నామన్నారు.

జిల్లా అభివృద్ధికి పార్టీలకతీతంగా సహకరించాలి: మంత్రి

రాయచూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి కోసం రాజకీయాలు, పార్టీలకతీతంగా ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని చిన్ననీటి పారుదల శాఖా మంత్రి ఎన్.ఎస్.భోసరాజు కోరారు. నగరంలోని చారిత్రక మామిడి చెరువు అభివృద్ధి పనులకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్‌తో కలిసి మంత్రి భోసరాజు సోమవారం భూమిపూజ చేవారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి రాష్ట్రంలో అనేక నగరాలు సుందరీకరణ జరిగాయని దురదృష్టవశాత్తు మామిడి చెరువు అభివృద్ధిలో పురోగతి లేకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైని నగరాన్ని అందంగా తీర్చిదిద్దే ప్రయత్నంలో భాగంగా మామిడి చెరువు అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. రూ.15 కోట్లతో మామిడి చెరువు అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఈ నిధులను నగర అభివృద్ధి కొరకు వ్యయం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. కాగా సమావేశంలో మాట్లాడిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం నిబద్ధతతో కృషి చేస్తునట్లు తెలిపారు. 371(జే) అమలు ద్వార కల్యాణ-కర్ణాటక ప్రాంతంఅభివృద్ధిలో వేగంగా దూసుకుపోతున్నట్లు మంత్రి వివరించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


పసంగిస్తున్న చిన్ననీటి పారుదల శాఖ మంత్రి భోసరాజు

హోసూరు జోన్

క్యాప్సికమ్‌కు తెగుళ్ల దెబ్బ

హోసూరు నవంబరు 4(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో సాగు చేసేవాటిలో క్యాప్సికమ్ మిరపకు తెగులు సోకడంతో విదేశాలకు ఎగుమతి చేసే అవకాశం లేకుండా పోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కృష్ణగిరి జిల్లాలోని హోసూరు బాగలూరు, కెలమంగలం, డెంకణీకోట ప్రాంతాల్లో రైతులు బీన్స్, క్యారెట్ , ముల్లంగి, మిర్చి తదితర పంటలను భారీ ప్రమాణంలో సాగు చేస్తున్నారు. ఇందులో దాదాపు 1000 ఎకరాల విస్తీర్ణంలో 90 రోజు ల్లో పంట చేతికి వచ్చే క్యాప్సికమ్ కూడా ఉంది. ఈ మిరపకు ఫాస్ట్ ఫుడ్ రెస్టారెంట్‌లో మంచి డిమాండ్‌ఉంది. హోసూరు ప్రాంతం నుంచి క్యాప్సికమ్‌ను విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అయితే క్యాప్సికమ్‌కు గుర్తు తెలియని తెగులు సోకడంతో దిగుబడి తగ్గడమే కాక నాణ్యత లేకపోవడంతో ఎగుమతికి అవకాశం లేకపోయింది. ఎగుమతి అయ్యే క్యాప్సికమ్ కిలో రూ.250 ఉండగా స్థానికంగా కిలో రూ.40-50 ధర పలుకుతోంది. ఆకుపచ్చ, పసుపు, ఎరుపు రంగుల్లో క్యాప్సికమ్ సాగు అవుతోంది. ప్రభుత్వం ఆదుకోవాలని మిర్చి రైతులు కోరుతున్నారు.


దెబ్బతిన్న క్యాప్సికమ్

డ్రైనేజీకి మరమ్మతులు

హోసూరు నవంబరు 4(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని బస్టాండ్ వద్ద మురుగు నీటి కాలువపై ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ స్లాబ్‌ను అధికారులు బాగు చేశారు. నిత్యం రద్దీగా ఉండే బస్టాండ్‌లో ప్రయాణీకుల రాకపోకలు కూడా అధికమే. ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ స్లాబ్‌ను బాగు చేయడంతో పెను ప్రమాదం తప్పినట్టయ్యిందని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రీవెన్స్‌డేలో 234 వినతులు


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సరయు

హోసూరు(కృష్ణగిరి) నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పీపుల్స్ గ్రీవెన్స్ డేలో ప్రజల సమస్యలను కలెక్టర్ సరయు ఆలకించారు. సోమవారం ఏర్పాటైన సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించగా వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. ఇళ్ల పట్టాలు, ఉచిత కుట్టుమిషన్‌లు, వృద్ధాప్య పింఛను, మహిళా హక్కుల భృతి, రోడ్డు సౌకర్యం, విద్యుత్ కనెక్షన్ వంటి పలు డిమాండ్‌లపై ప్రజల నుంచి 234 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. అర్హులైన వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కృష్ణగిరి జిల్లా దేవాదాయ శాఖ కమిషనర్ షాజహాన్, జిల్లా కలెక్టర్ ఇంటర్న్యూ అసిస్టెంట్ సుందర్‌రాజ్, జిల్లా ఆది ద్రావిడర్ సంక్షేమాధికారి రమేశ్‌కుమార్, జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ అధికారి పద్మలత, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోండి

హోసూరు(కృష్ణగిరి) నవంబరు4(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని అన్ని వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక సంస్థలు ట్రేడ్ లైసెన్స్ ఫీజును ఆన్‌లైన్ ద్వారా చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని హోసూరు కార్పొరేషన్ కమిషనర్ హెచ్‌ఎస్‌ఆర్ శ్రీకాంత్ తెలిపారు. తమిళనాడు అర్బన్ లోకల్ బాడీస్ యాక్ట్ ప్రకారం హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని వాణిజ్య సంస్థలు పారిశ్రామిక సంస్థలు ట్రేడ్ లైసెన్స్‌కు రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. వ్యాపారస్తులు తదితరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కళలను కాపాడుకోవాలి

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్


యారిగే బేకు నిన్న కవితే నాటిక సన్నివేశం

బళ్లారి సిటీ, నవంబరు4(ఆంధ్రజ్యోతి): కళలను కాపాడుకునేందుకు పోషకుల పాత్ర అనన్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి బళ్లారి కల్చరల్ యాక్టివిటీస్ ఆధ్వర్యంలో ఒంగిరణ రంగమందిరంలో రాజ్యోత్సవం సాంస్కృతిక సంభ్రమ 2024 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. భారతీయ కళలు నేటి తరానికి అందించేందుకు సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం రంగారెడ్డి సుగుమసంగీతం, రామచంద్ర బృందం ఆధ్వర్యంలో యారిగే బేకు కవితే ఆస్యా నాటకం, తుంగ గంగా సాంస్కృతిక కళాకారుల నృత్యప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. కళాకారులను జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. అల్లం ప్రశాంత్, మేయర్ ముల్లంగి నందీష్, రామచంద్ర, నాగభూషణను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శీలాబ్రహ్మయ్య, కార్యదర్శి యశ్వంత్‌రాజ్, రామమూర్తి, ప్రకాశ్, డాక్టర్ మల్లేశ్, డాక్టర్ వీణ, మంజునాథ్, బసవరాజు, కళాకారులు పాల్గొన్నారు.

1.653 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటి నిల్వ 1.653 టీఎంసీలు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం తెలిపారు. ఇన్‌ఫ్లో 1042 క్యూసెక్కులుగా రికార్డు అయినట్లు తెలిపారు.